క్లుప్తంగా

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేత

కొండమల్లేపల్లి : దేవరకొండ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఐదు పత్తి మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోయినందున గురువారం నుంచి తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు సీసీఐ బయ్యర్ శ్రీనివాస్‌రావు, మార్కెట్‌కార్యదర్శి కిరణ్‌కుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి కొనుగోలు తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని, రైతులు సహకరించాలని కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం(పీజీటీ), జంతుశాస్త్రం(జేఎల్) పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తుల కోరుతున్నట్లు తెలిపారు. ఈనెల 9వ తేదీలోగా కళాశాలలో డెమో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సాయికుమార్



డిండి : యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా డిండి పట్టణానికి చెందిన గడ్డమీది సాయికుమార్ బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి ఎన్నికకు సహరించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తూ కాంగ్రెస్ పార్టీ అబివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అభ్యర్థుల లిస్టు ప్రకటించాలి

మిర్యాలగూడ టౌన్ : విదేశీ విద్యకు సంబంధించిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అభ్యర్థుల లిస్ట్‌ను తక్షణమే ప్రకటించాలని కోరుతూ బుధవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీడయ్య యాదవ్ బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా మర్యాదపూర్వకంగా ఆయనకు శాలువాతో సత్కరించారు. ఈ విషయంపై మంత్రి త్వరలోనే ఈ జాబితాను విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు జీడయ్య యాదవ్ తెలిపారు.

మహిళా ప్రయాణికులకు బహుమతులు ప్రదానం



మహిళలకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ రమేశ్

దేవరకొండ : డీలక్స్ బస్సులో ప్రయాణించి లక్కీ డ్రా ద్వారా ఎంపికైన ముగ్గురు మహిళా ప్రయాణికులకు బుధవారం దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేశ్ బాబు అన్నారు. ప్రతి 15రోజులకు ఒక సారి డ్రా పద్ధతిన ముగ్గురిని ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులు టికెట్ వెనకాల పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలని ఆయన సూచించారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం పడాల సైదులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

పెద్దవూర : మండలంలోని పొట్టివానితండాకు చెందిన రమావత్ రక్షిత్‌బాబు తన తండ్రి నాగేశ్వర్‌రావు జ్ఞాపకార్థం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పాపిరెడ్డి మాట్లాడుతూ మారుమూల గిరిజన తండాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు దాతలు చేయూత నందించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం రమావత్ రాంకోటి, పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న యాదగిరిగౌడ్

పెద్దవూర: మండలంలోని పెద్దవూర గ్రామ పంచాయతీ పరిధిలోని ఈదులగూడెం గ్రామానికి చెందిన బత్రి సైదయ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.56వేల చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్నాటి పద్మారెడ్డి, వెంకటయ్య, వెంకన్న, అంజి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కోత!

- బస్తా బరువుకు అదనంగా రెండు కిలోలు తూకం
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



డిండిలో వరిధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

డిండి : ఆరుగాలం కష్టించి వరిధాన్యం పండించిన రైతులపై మిల్లర్ల చేతివాటం బలంగా నడుస్తోంది. వడ్ల కొనుగోలు విషయంలో రైతులకు ప్రభుత్వం సూచించిన మిల్లర్లకు నేరుగా సంబంధాలు లేకపోవడంతో కొనుగోలు సెంటర్ నిర్వాహకుల సాయంతో మిల్లర్ల దోపిడీ కొనసాగుతోంది. దీంతో వచ్చిన పంట దిగుబడిలో లారీకి దాదాపు మూడు క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని రైతుల నుంచి లాక్కోవడంతో వారికి ఎలాంటి లాభం చేకూరకుండా పోతుంది. ఇదే అదునుగా భావించిన మిల్లర్లు సెంటర్ నిర్వాహకులకు అవగాహన లేకపోవడాన్ని కూడా అనుకూలంగా మలుచుకుంటున్నారు.

తరుగు పేరుతో దోపిడీ

పీఏసీఎస్ ఆధ్వర్యంలో సన్నరకానికి 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే దొడ్డు రకానికి 14 సెంటర్లు , ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో 03 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో ఇప్పటి వరకు 34వేల క్వింటాళ్ల సన్నరకం ధాన్యం, 65వేల క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేశారు. దేవరకొండ నియోజకవర్గంలోని దేవరకొండ, డిండి, కొండమల్లేపల్లి, చింతపల్లి, పీఏపల్లి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు సెంటర్లలో ఒక బస్తాకు 40కిలోలకు తరుగు పేరుతో 700గ్రాములు అదనంగా తూకం వేయాలి. అలా కాకుండా ఒక సెంటర్‌లో బస్తాకు 41కేజీ 50 గ్రాములు, మరో చోట 42కిలోల వరకు తూకం వేస్తున్నారు. రైతులకు వెంటనే రశీదులు కూడా ఇవ్వడం లేదు. ధాన్యం లోడ్‌ను వారికి కేటాయించినట్లు మిల్లులకు పంపిస్తున్న క్రమంలో మిల్లర్లు వారికిష్టమొచ్చినట్లుగా కొర్రీలు పెడుతూ ఒక్కో లారీకి క్వింటాల్ నుంచి మూడు క్వింటాళ్ల వరకు కోతలు పెడుతున్నట్లు రైతుల నుంచి బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు హమాలీ క్వింటాల్‌కు రూ.45తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే హమాలీల చార్జీలు కూడా రైతులే చెల్లిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో సాగు చేసిన కొంత పొలాల్లో వరిచేసుకు తెగుళ్ల బెడద రావడం ఒకటైతే, కొనుగోలు సెంటర్‌కు వచ్చిన ధాన్యాంపై కోతలు పెడుతుండటంతో పెట్టిన పెట్టుబడి సరిపోతుందో లేదోనని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఇలా..

ప్రభుత్వాదేశానుసారం ఏ గ్రేడ్‌లో సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు రూ. 2320, దొడ్డు వడ్లకు క్వింటాల్‌కు రూ.2300 మద్దతు ధర ఉంది. కొనుగోలు చేసే సమయంలో ధాన్యాన్ని ఆధారంగా అధికారులు రేట్ నిర్ణయిస్తారు. తూకం అయిన వెంటనే సదరు రైతుకు రశీదు ఇవ్వాలి. 40కేజీల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న క్రమంలో ఒక్క గోనే సంచికి 600 గ్రాములు తరుగుతో కలిపి బస్తాను మొత్తం 40 కేజీల 600 గ్రాములు మాత్రమే తూకం వేయాలి. ఆన్‌లైన్‌లో నమోదైన వెంటనే కొనుగోలుకు సంబంధించి నేరుగా రైతుల అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయని నిబంధనలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం



వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 40కేజీలల బస్తాకు గోనే సంచి తరుగుకు సంబందించి 600 గ్రాములు మాత్రమే ఎక్కువ తూకం చేయాలి. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లా ఉన్నతాధికారులాదేశాల మేరకు సెంటర్లలోని ధాన్యం తేమ రాగానే మిల్లులకు తరలిస్తున్నాం.

– హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, డీటీసీఎస్

రైతులం నష్టపోతున్నాం



బస్తాకు 600 గ్రాములు మాత్రమే ఎక్కువ తూకం వేయాల్సి ఉండగా నా వద్ద 40కిలోల బస్తాపై అదనంగా ఒక కిలో 600 గ్రాములు ఎక్కువ తూకం వేసారు. ఇలా కోతలు పెడుతుండటంతో రైతులమంతా నష్టపోతున్నాం. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పి.శ్రీను రైతు, చింతకుంట్ల

42కిలోలు తూకం వేశారు



డిండిలో నాకున్న ఎకరం భూమిలో సాగు చేయడంతో పండిన 50బస్తాల వడ్లను అమ్ముకునేందుకు కొనుగోలు సెంటర్‌కు తీసుకవచ్చా. బస్తాకు తరుగుతో కలిపి 40 కేజీలకు 600 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా బస్తాకు 42 కేజీలు తూకం వేశారు. దీంతో దాదాపు 50 కేజీలకు పైగా ధాన్యాన్ని నష్ట పోయాను.

– బల్మూరి చిన్నమ్మ, రైతు, డిండి

నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ఆయా శాఖల అధికారులు, ఎంఈఓలు, గురుకుల పాఠశాల హెచ్‌ఎంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అధికారులు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలలను, వసతిగృహాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి పర్యవేక్షించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా కూరగాయలతో సరైన ఆహారం అందించకపోయినా, పాఠశాలలు, హాస్టళ్లు పరిశుభ్రంగా లేకపోయినా నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఆయా మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్



పాఠశాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని గిరిజన గురకుల పాఠశాలను బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పాఠశాల, హాస్టల్ రూమ్‌లను, స్టోర్‌రూమ్‌లోని నాసిరకంగా ఉన్న కూరగాయలను పరిశీలించి వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీటి వల్ల తాము అనారోగ్యానికి గురైనట్లు పలువురు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే హాస్టల్‌లో అన్ని వసతులు మెరుగుపరచాలని, నాణ్యమైన సరుకులతో మాత్రమే విద్యార్థులకు ఆహారం అందించాలని, లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించడంలో విఫలం



విద్యార్థినిని పరామర్శిస్తున్న రవీంద్రకుమార్

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో విఫలం చెందిందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. పీఏపల్లి మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు అస్వస్థతకు గురై మంగళవారం దేవరకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరామర్శించి వివరాలు తెలుసుకొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పై శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు.రాష్ట్ర వ్యాప్తంగా 950మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వల్ల ఆస్పత్రుల పాలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం బాధకరమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, మోడల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, మధు, తులసీరాం, ఇలియాస్ పటేల్, బాలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఎన్నిక

అడవిదేవులపల్లి : తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా డి. విద్యాచందర్‌నాయక్, అధ్యక్షుడు ఆంగోతు నాగానాయక్, ప్రధాన కార్యదర్శిగా కొర్ర శ్రీనునాయక్, ఉపాధ్యక్షులుగా మౌనిక, భగవాన్‌నాయక్, కోశాధికారిగా ఎస్.విజయలక్ష్మిలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గిరిజన సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సైదులునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతినాయక్, బాషానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్‌నాయక్‌లు హాజరయ్యారు.



నాగానాయక్, అధ్యక్షుడు



కొర్ర శ్రీను ప్రధాన కార్యదర్శి

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



తిరుమలగిరిలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లింగారెడ్డి

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండలంలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి సొంత ఖర్చులతో సమకూర్చిన దుప్పట్లను బుధవారం మండల కేంద్రంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. సంక్షేమ వసతి గృహాల్లో నివాసం ఉండే విద్యార్థులు చలికాలం రాత్రి ససమయంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి తెలుసుకుని తన సొంత ఖర్చులతో విద్యార్థులకు దుప్పట్లను సమకూర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి సాగర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు భగవాన్ నాయక్, బ్రహ్మానందరెడ్డి, నాయకులు కృష్ణ నాయక్, లాలునాయక్, నాగరాజు, మునినాయక్, బాలునాయక్, వెంకన్న, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, బద్రి నాయక్, పాపిరెడ్డి, పాండునాయక్, అంజి, సైదులు, హరినాయక్, పాండురంగ, శ్రీనునాయక్, వెంకటేశ్వర్లు, బీలునాయక్, సర్దార్‌నాయక్, కృష్ణ, మోతీలాల్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేస్తున్న డివిజనల్ వ్యవసాయ అధికారి దేవ్‌సింగ్‌నాయక్

అడవిదేవులపల్లి : ప్రభుత్వ నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మిర్యాలగూడ డివిజనల్ వ్యవసాయ అధికారి భూక్య దేవ్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు పురుగులు మందుల, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం స్టాక్‌కు సంబంధించిన అన్నీ రకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలమేరకే పురుగులు మందులను అమ్మాలని, రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని దుకాణాదారులను ఆదేశించారు. యాసంగి వరకి నారు మడి యాజమాన్యం గురించి రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అనేనారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారిని జి. సరిత, ఏఈవో మహేష్‌నాయక్, రావుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గుర్రంపోడు : సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలకేంద్రంలో కేజీబీవీ, విద్యావనరుల కేంద్రం ఎదుట బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇటికాల రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెలో విద్యాశాఖలోని అన్ని విభాగాల కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈనెల 6. 7 వ తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే రిలే నిరాహార దీక్షకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ డి. విజయలక్ష్మి, సీఆర్‌టీలు, సీఆర్‌పీలు, పీటీఐలు. ఐఈఆర్పీలు, మెసెంజర్‌లు, పార్ట్‌టైం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

అడవిదేవులపల్లి : టెయిల్‌పాండ్‌పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ బుధవారం అడవిదేవులపల్లికి వచ్చిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి స్థానికులు కోటయ్య, రామయ్య, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు టెయిల్‌పాండ్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడితే అన్ని రకాలు వ్యాపార వాణిజ్యానికి అనుకూలంగా ఉంటుందని వినతిపత్రంలో వివరించారు.

అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు అన్నదానం



మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం దేవాలయంలో నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయన వెంట వ్యాపారవేత్తలు గుడిపాటి నవీన్, బండారు కుశలయ్య, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, అయ్యప్ప దేవాలయం కమిటీ శాశ్వత అధ్యక్షుడు ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, గురుస్వాములు దేశిడి శేఖర్‌రెడ్డి, గోదాల జానకీ రాంరెడ్డి, సుబ్బారెడ్డిలతో పాటు పలువురు అయ్యప్ప, ఆంజనేయస్వామి, శివమాలదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో..

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని దాసా ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం మాలాధారులకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదాబాబ్‌నాయక్, పొదిల శ్రీనివాస్, హనుమంతు, నాగేశ్వర్‌రావు, నర్సింహ్మారావు, అల్లాని కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మోసాలతో కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి



ర్యాలీ ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

చింతపల్లి : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు 66 మోసాలు చేయడం ప్రజలందరికీ తెలిసిపోయిందని, గ్యారంటీల అమలు చేయకుండా ప్రజాపాలన విజయోత్సవాల పేరుతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాలు నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ఎండ కట్టేందుకు రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు శివర్ల రమేష్ ఆధ్వర్యంలో చింతపల్లి మండలకేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజయ్య ,నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, కన్వీనర్ కృష్ణ, నరసింహ, ఆంజినాయక్, శేఖర్, నగేష్, సైదులు, మహేశ్, శ్రీశైలం, అభినవ్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



అడవిదేవులపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ పద్మ

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా ఇమ్యూనేషన్ అధికారిని(డీఐఓ) డాక్టర్ ఎస్. పద్మ తనిఖీ చేశారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాలతో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని మొల్కచర్ల గ్రామంలో నిర్వహించిన టీకాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డాక్టర్ సయ్యద్ అహ్మద్ హజహర్ అహ్మద్, డాక్టర్ రామాంజనేయులు, సీహెచ్‌ఓ షాహేద్, ఫార్మసిస్టు స్వరూప, ఉదయ్, ఉష తదితరులు పాల్గొన్నారు.

మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం



ఆలయంలో రుద్ర హోమం చేస్తున్న అర్చకులు

మిర్యాలగూడ : ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా దేవాదాయశాఖ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశానుసారం బుధవారం దామరచర్ల మండలంలోని వాడపల్లిలో మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి రుద్ర హోమం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ సిద్ధయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 9వరకు నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గ్రామం, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని ఆలయంలో రుద్రహోమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ బి.జ్యోతి, అర్చకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి కంటి పరీక్షలు



మిర్యాలగూడ టౌన్ : కార్మికులను సన్మానిస్తున్న అధికారులు, లయన్స్‌క్లబ్ సభ్యులు



నాగార్జునసాగర్ : ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా స్థానిక మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ టీకేఆర్ స్మారక కంటి ఆస్పత్రిలో కంటి పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరం ఉన్న కార్మికులకు కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. అదే విధంగా లయన్స్ క్లబ్, మున్సిపల్ శాఖ వారు పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ జాఫర్, లయన్స్‌క్లబ్ సభ్యులు గుండా గోపాలకృష్ణ, మాశెట్టి లింగయ్య, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా బుధవారం నందికొండ మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందికి స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించారు. ఆసుపత్రిలో ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అన్నిరకాల రోగ నిర్ధారణ పంరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన పలురకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ భానుప్రసాద్ నాయక్, డాక్టర్లు చక్రవర్తి, ఆవని, పాలీన ఆస్పత్రి సిబ్బంది, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీటి కష్టాలు

- ఎస్టీ మినీ గురుకులంలో పనిచేయని వాటర్ ఫిల్టర్
- కొన్ని సమయాల్లో బోరు నీరే దిక్కు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు



మరమ్మతులకు గురైన వాటర్ ఫిల్టర్

త్రిపురారం : మండల కేద్రంలోని ఎస్టీ మినీ గురుకులంలో వాటర్ ఫిల్టర్ పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ గురుకులంలో సుమారు 135మంది విద్యార్థులు ఉంటున్నారు. వాటర్ ఫిల్టర్ మరమ్మతులకు గురికావడంతో ప్రతి రోజు గ్రామంలోని ప్రయివేటు వాటర్ ఫిల్టర్ వద్ద నుంచి మంచి నీరు తెప్పించి వినియోగిస్తున్నారు. అందరూ చిన్న పిల్లలు కావడంతో ఫిల్టర్ వాటర్ అందుబాటులో లేని సమయంలో బోరు నీరు తాగాల్సి వస్తుంది. కొందరు చిన్నారులు హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ నీరు తాగుతున్నట్లు తెలిసింది. బోరు నీరు ఉప్పుగా ఉండడంతో పాటుగా కలుషిత నీరు కూడా వచ్చే అవకాశం ఉంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా పాఠశాలలోనే ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి నిత్యం శుద్ధి చేసిన వాటర్ చిన్న పిల్లలకు అందుబాటులో ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు గుర్తించి మంచి నీరు పాఠశాలలోనే తయారు చేసుకునే విధంగా ముందుకురావాలని విద్యార్థులు వేడుకుంటున్నారు. మండల అధికారులు కూడా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిల్టర్‌కు మరమ్మతులు చేయించాలి



హాస్టళ్లల్లో చిన్నారులకు మంచి నీరు ఎప్పుడూ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ చాలా అవసరం . మరమ్మతులకు మరమత్తులకు గురైన వాటర్ ప్లాంట్‌ను గుర్తించి తక్షణమే అందుబాటులోకి తీసుకరావాలి. పాఠశాల బాధ్యులు కూడా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకోవాలి.

– పానుగోటి హరీశ్, త్రిపురారం